01ATP12F.qxd:01ATP12F.qxd 13/06/26 11:26 PM Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 13 జూన్ 2026 పేజీలు : 04

: తాడిపత్రికి వేలాదిగా తరలివచ్చిన వైకాపా శ్రేణులు

: పెద్దారెడ్డి నిరసన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

:ఉన్నత న్యాయస్థానం ఊరటకు పోలీసుల అడ్డుకట్ట

# వెన్నుపోటు నిరసనకు పోలీసుల పోటు





- ర్యాలీతో ఇంటి నుంచి బయలుదేరిన కేతిరెడ్డి పెద్దారెడ్డి - ర్యాలీతో వస్తున్న పెద్దారెడ్డిని ఇంటి వద్దనే అడ్డుకున్న పోలీసులు -పోలీసుల చర్యలకు నిరసనగా బైఠాయించిన పెద్దారెడ్డి




పోలీసు హెడ్‌క్వార్టర్స్ వద్ద జిల్లా నాయకులతో కలిసి పెద్దారెడ్డి నిరసన , వైకాపా నాయకులతో మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారులు

**తాడిపత్రి, జూన్ 12, ప్రభాతవార్త:** మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రిలో శుక్రవారం తలపెట్టిన చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమానికి పోలీసుల పోటు తప్పలేదు. రెండేళ్ల తర్వాత మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వేచ్ఛగా నియోజకవర్గంలో తిరగొచ్చనే హైకోర్టు తీర్పుతో వైకాపా శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబికింది. దీంతో నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది వైకాపా నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయాన్నే భగత్‌సింగ్ నగర్‌లోని పెద్దారెడ్డి ఇంటికి చేరుకున్నారు. నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీగా నిరసన వ్యక్తం చేస్తూ పెద్దారెడ్డి తన ఇంటి వద్ద నుంచి వైయస్సార్ సర్కిల్‌కు బయలు దేరారు. ఇంతో సీఐ శివగంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు పెద్దారెడ్డి ఇంటికి చేరుకొని అనుమతి లేదంటూ ర్యాలీని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి సారథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు పోలీసులకు నడుమ తోపులాట చోటు చేసుకుంది. ప్రభుత్వ, పోలీసు వ్యతిరేక నినాదాలతో పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి.పోలీసుల చర్యలకు నిరసనగా అడ్డుకున్న చోటనే పెద్దారెడ్డి నిరసనకు దిగి బైఠాయించారు. కొద్ది సేపటి తరువాత పెద్దారెడ్డిని పోలీసులు అనంతపురానికి తరలించారు. అనంతపురానికి చేరుకున్న తరువాత ఆయన జిల్లా నాయకులతో కలసి పోలీసు హెడ్ క్వార్టర్స్ ముంగిట ఆందోళనకు దిగారు. వైకాపా జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌లతో కలసి కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎస్పీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. జేసీ అనుచరులు ఒక మాజీ సర్పంచిని బెదిరించడానికి 50 వాహనాల్లో తాడిపత్రి నుంచి పెద్దవడుగూరుకు వెళితే అడ్డుకోలేని పోలీసులు, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అనంత వెంకట్రామిరెడ్డి విమర్శించారు. తాడిపత్రిలో పోలీసులు గంజాయి విక్రయాలను పట్టించుకోకుండా పరోక్షంగా ప్రోత్సహిస్తూ, జేసీ చెప్పుచేతల్లో విధులు నిర్వహిస్తున్నారని కేతిరెడ్డి పెద్దారెడ్డి తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు పేరం స్వర్ణలత,వెన్నపూస వెంకట్రామిరెడ్డి, బోగాతి బ్రహ్మానందరెడ్డి, సజ్జలదిన్నె రాజు, ఆలూరు రామేశ్వరరెడ్డి, ఎద్దుల శరభారెడ్డి, ఆర్సీ ఓబుళరెడ్డి, వేమనాథరెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెద్దపేట లక్ష్మిదేవి, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

**:పెద్దారెడ్డిపై కేసు నమోదు..!**

ఈ నెల 9న వైకాపా నాయకులతో తాడిపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదు మేరకు శుక్రవారం పట్టణ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ నాయకుడు పరిమి సోమశేఖర్ నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు 196(1) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పెద్దారెడ్డిపై కేసు నమోదు చేసిన సీఐ ఆరోహణరావు ఎఫ్ఐఆర్‌ను అందించిన తరువాతనే మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పోలీసు స్టేషన్ ఎదుట చేపట్టిన ఆందోళనను విరమించారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ భారీ నిరసన ర్యాలీ

**చంద్రబాబు వెన్నుపోటు పరిపాలనకు రెండేళ్లుజిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్**




మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, కూటమి ప్రభుత్వం పై వైసిపి నిరసన భారీ బైక్ ర్యాలీ

**పెనుకొండ జూన్ 12 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం పెనుకొండలో భారీ నిరసన బైక్ ర్యాలీ చేపట్టారు. వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటుకు రెండేళ్ల పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మాజీ మంత్రి పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో పెనుకొండ సమీపంలోని జాతీయ రహదారిలో గల వైఎస్ఆర్సిపి కార్యాలయం నుండి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ , ఆర్డీవో కార్యాలయం ముందు వరకు భారీ బైక్ ర్యాలీ తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల చంద్రబాబు అరాచక పాలనపై నిప్పులు చెరిగారు.రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, రెండు సంవత్సరాల కాలంలో ప్రజల నమ్మకాన్ని, వారు పెట్టుకున్న ఆశలను పూర్తిగా వమ్ము చేసింది. ఎన్నికల ముందు ఒక మాట,అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట చెప్పడం ఈ ప్రభుత్వంలో నాయకులకు సరిపాటి ఎవ్వరూ లేరు. ప్రజలు ఆశించిన పాలన కాకుండా, ప్రచారాలు, ఆర్భాటాలు పాలనను అందిస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి పెట్టారన్నారు. రైతులకు అండగా ఉంటామని చెప్పి రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారు. అన్నదాత ఆక్రందనలు తిలకించే నాథుడే లేడు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను రోడ్డుకు లాగేశారు. ఇచ్చినా ఒక్క డీఎస్సీ లో కూడా అక్రమాలు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని చెప్పి హామీలను గాలికొదిలేసింది. పేదలకు సంక్షేమం అందిస్తామని చెప్పి సంక్షేమ పథకాలకు కోతలు విధించింది. మొదటి సంవత్సరం అన్ని సంక్షేమ పథకాలు మాఫీ చేశారు. రెండో సంవత్సరం ఇచ్చిన పథకాలు కూడా కోతలు పెట్టారు.సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ఆ హామీల గురించి మాట్లాడటానికే వెనుకాడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వై ఎస్ ఆర్ కాగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాము అన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామని చెప్పారు ఎక్కడ ఇచ్చారో ఎప్పుడు ఇచ్చారో చెప్పండి. రైతులకి గతంలో కంటే ఎక్కువ మేలు జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రజలు తాగునీరు, సాగునీరు, ఉపాధి, విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రచారాలు, ఆర్భాటాలతో ప్రజలకు అన్నీ చేసేశామనే భ్రమను కల్పిస్తున్నారు. అబద్ధాల ప్రచారంతో ప్రజలను ఎక్కువ కాలం మోసం చేయలేరు. చంద్రబాబు పాలన అంటే అభివృద్ధి పేరుతో ప్రచారం, హామీల పేరుతో మోసం, ప్రజల నమ్మకానికి వెన్నుపోటు పొడిచే పరిపాలనకు నిదర్శనం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికొదిలేయడం చంద్రబాబుకు అలవాటుగా మారింది.ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారంలో చేసిన పనులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసిన ప్రతి ప్రభుత్వానికి ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారు.అన్ని వర్గాల వారికి శఠగోపం పెట్టిన కూటమి పాలన కు రోజులు దగ్గర పడ్డాయని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఎన్నిక ఏదైనా కూటమికి తిలోదాకాల తర్పణం విడవడం ఖాయమని హెచ్చరించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలపై నిరంతరం పోరాడాలని ఉషాశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు మధుమతి రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పోగాకు రామచంద్ర, ఐదు మండలాల కన్వీనర్ లు సుధాకర్ రెడ్డి, గజేంద్ర, తిమ్మయ్య, నరసింహామూర్తి, వెంకటేష్, పెనుకొండ మాజీ మండల కన్వీనర్ లు నాగలూరు బాబు, శ్రీకాంత్ రెడ్డి,పట్టణ కన్వీనర్ లు నరసింహులు, మేదర శంకర, పెనుకొండ మండల వైస్ కన్వీనర్ కురుబవాండ్లపల్లి చెన్నకేసులు,పేనుకొండ నియోజకవర్గం ఇంటలెక్చువల్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి,గుట్టూరు బాబు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు,మాజీ సర్పంచ్ లు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కూటమి పాలనలో అన్ని వర్గాలకు వెన్నుపోటే!

- వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత




మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత , ర్యాలీగా వస్తున్న వైసిపి శ్రేణులు

**అనంతపురం సిటీ, జూన్ 12 ప్రభాతవార్త** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల వారికి వెన్నుపోటు పొడుస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ అనంతపురం నగరంలో వైసిపి శ్రేణులు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతపురం అర్బన్ సమన్వయ కర్త, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని లలిత కళా పరిషత్ నుంచి టవర్‌క్లాక్ వరకు భారీ ర్యాలీని నిర్వహించి టవర్‌క్లాక్ వద్ద మానవ హారంగా ఏర్పడి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో హామీలను అమలు చేయకపోగా హామీలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి వేదింపులకు గురి చేస్తున్నాయన్నారు.

తొలి సంతకంగా చేసిన డిఎస్సీని కూడా సరిగా నిర్వహించకుండా అక్రమాలకు నిలయంగా మార్చి నిరుద్యోగులను వంచించారని మండి పడ్డారు. అదే విధంగా యువతకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నారని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వైసిపి ప్రజల పక్షాన పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు మనోజ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ లో శివరామిరెడ్డి, మంగమ్మ, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మతోపాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ నేతలతోపాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో రాజకీయ రగడ

- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలని టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆరు గంటలు బైఠాయించిన మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి - పోలీస్‌స్టేషన్ గేటు వద్ద మంచం వేసుకుని స్నానం చేసి నిరసన వ్యక్తం చేసిన జె.సి - పెద్దారెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు - దీక్ష విరమించిన జె.సి ప్రభాకర్‌రెడ్డి





టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద మంచం వేసుకుని నిరసన తెలుపుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి,- స్నానం చేస్తూ నిరసన తెలుపుతున్న జె.సి , పెద్దారెడ్డిపై కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ

**తాడిపత్రిఅర్బన్, జూన్ 12 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయ రగడ తారాస్థాయికి చేరింది. వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టిడిపి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుటే మంచం వేసుకుని స్నానం చేసి దాదాపు 6 గంటల పాటు నిరసనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు కాపాడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేయడంతో జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆందోళన విరమించారు. రెండు రోజుల క్రితం జరిగిన వైఎస్ఆర్‌సిపి సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు, నాయకులపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. టిడిపి కౌన్సిలర్లను అవమానించేలా మాట్లాడటమే కాకుండా, హైకోర్టు విధించిన ఆంక్షలను సైతం ఉల్లంఘించారని ఆరోపిస్తూ జె.సి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు చేసినప్పటికీ కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జె.సి ప్రభాకర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్ ఎదుటే మంచం వేసుకుని నిరసన ప్రారంభించారు. సాధారణ వ్యక్తి అయితే వెంటనే కేసు నమోదు చేసే పోలీసులు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని, చట్టం అందరికీ ఒకటే కాదా అని పోలీసులను ప్రశ్నించారు. కేతిరెడ్డిని రాజకీయంగా కాపాడేందుకే కేసు నమోదు చేయడం లేదని ఆరోపణలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసు నమోదు చేసే వరకు పోరాటం ఆగదని టిడిపి శ్రేణులు స్పష్టం చేశాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై చర్యలు తీసుకోవాలని జె.సి ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన నిరసనతో తాడిపత్రి రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేతిరెడ్డి పెద్దారెడ్డి హైకోర్టు ఆదేశాలను పాటించకుండా తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నా పోలీసులు మిన్నకుండి పోతున్నారన్నారు. తాము ప్రజాస్వామ్య పద్ధతిలో వెళుతున్నా పోలీసులు అప్పుడు ఇప్పుడు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డిపై బిఎన్ఎస్ యాక్ట్ 196 (1) సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి జె.సి ప్రభాకర్‌రెడ్డికి అందజేసిన తరువాత ఆయన తన అనుచరులతో కలిసి ఇంటికి వెళ్ళిపోయారు. పోలీసుల తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. సోమవారం అనంతపురం జిల్లా ఎస్పి కార్యాలయంలో ఎస్పిని కలిసి మాట్లాడుతానని జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

# తాడిపత్రిలో ప్రజా స్వామ్యాన్ని కాపాడండి

- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత - ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాని నిర్వహించిన వైసిపి నేతలు
- జగన్ ఉన్నంత వరకు ఎవ్వరికి భయపడం - కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

**అనంతపురం సిటీ, జూన్ 12 ప్రభాతవార్త** తాడిపత్రిలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత పోలీసులపై ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. తాడిపత్రిలో వైసిపి ఆధ్వర్యంలో చేపట్టాల్సిన వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంలో పాల్గొనకుండా మాజీ ఎమ్మెల్యే, వైసిపి తాడిపత్రి నియోజకవర్గ సమన్వయ కర్త కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతపురంకి తరలించారు. దీనిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డికి మద్దతుగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి జిల్లా పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే అత్తారు చాంద్‌బాషాతోపాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా నారాలోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండి పడ్డారు. తాడిపత్రిలో పోలీసు అధికారులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తూ వైసిపి శ్రేణులపై వేదింపులకు ప్లాపడుతున్నారని మండి పడ్డారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో నిర్వహించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండి పడ్డారు. టిడిపి నేతలు చెప్పిన రీతిలోనే పోలీసులు నడుచుకుంటున్నారని విమర్శించారు. ఎస్పీతోనే మిగతా 3 లో...

# టీడీపీ నాయకుల బస్సుపై వైసీపీ నాయకుల దాడి

- బస్సుపై దాడి చేసి అద్దాలు పగలగొట్టిన వైనం - తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రంగయ్యపై ఎస్పీకి ఎమ్మెల్యే అమిలినేని పిర్యాదు
- నిందితులను అరెస్ట్ చేయాలని ఎస్పీ బంగ్లా వద్ద తెలుగు తమ్ముళ్ల ఆందోళన..




జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టిడిపి నాయకులు, ఎస్పీ బంగ్లా ఎదుట ఆందోళన చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

**అనంతపురం క్రైమ్, జూన్ 12 ప్రభాతవార్త** టిడిపి నాయకులు ప్రయాణిస్తున్న బస్సుపై వైసీపీ నాయకులు అటాక్ చేశారు. దాడి చేయడమే కాక బస్సుపై రాళ్లు రువ్వడంతో బస్సులు పగిలాయి. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలంలోని కురుకుంట గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు అనంతపురం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న సర్ అవగాహన కార్యక్రమానికి వస్తున్న సందర్భంలో బైక్ ర్యాలీ చేపట్టిన వైసిపి నాయకులు ఎదురు పడ్డారు. దీంతో వారి మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. చివరకు బస్సులపై వైసిపి మూకలు దాడికి తెగబడే వరకు వెళ్ళింది. దీంతో అనంతపురం చేరుకున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు తమ అనుచరులతో ఎస్పీ బంగ్లా వద్దకు చేరుకున్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అనుచరులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ బంగ్లా ఎదుటే దిగారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ ను కలిసి పరిస్థితిని వివరించారు. ఈ దాడి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రంగయ్యలు దగ్గరుండి దాడి చేయించారంటూ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమ్మినేని సురేంద్రబాబు టిడిపి నాయకులు ఆరోపించారు. రంగయ్య సూచనలతో కురుగుంట సమీపంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దగ్గరుండి తన అనుచరుల ద్వారా బస్సును ఆపి అద్దాలు పగలగొట్టి ధ్వంశం చేశారని ఆరోపించారు. తాము సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలతో ఉన్నామన్నారు. వైసిపి మూకలు 150 మంది వున్నారన్నారు. అయినా తాము సంయమనం పాటించామన్నారు. తాము ఎదురుదాడికి దిగలేక చట్టమైన చట్టపరమైన చర్యలకు ఆశిస్తున్నామన్నారు. ఇటీవల కళ్యాణదుర్గం పట్టణంలో రెండేళ్ల విజయోత్సవ ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలను రంగయ్య అనుచరులు అడ్డుకోవడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశామని ఎమ్మెల్యే అమిలినేని మిగతా 3 లో...

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**హిందూపురం జూన్ 12 ప్రభాతవార్త**

హిందూపురం రూరల్ పరిధిలోని కోటిపి, గొల్లపురం, తూముకుంట, చౌలూరు, సంతేబిదనూరు, బేవినహళ్లి, ఉడుగులపల్లి, నక్కలపల్లి, సంజీవరాయనపల్లి, కిరికెర, బసవనపల్లి, దేవరపల్లి, కక్కల్లు, సుబ్బిరెడ్డిపల్లి, అప్పలకుంట తదితర గ్రామాలలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తూముకుంట సబ్ స్టేషన్ నందు 132కెవి లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

## నాలుగవ వార్డులో స్వచ్ఛ హిందూపురం



శుభ్రత పనులు చేస్తున్న టిడిపి యువ నాయకులు

**హిందూపురం టౌన్ జూన్ 12 ప్రభాతవార్త**

హిందూపురం మున్సిపాలిటీ నాలుగవ వార్డులో టిడిపి యువ నాయకులు అశోక్, చింటూ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ హిందూపురం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని కాలువలు శుభ్రం చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు ఈ సందర్భంగా అశోక్ చింటూ మాట్లాడుతూ హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం పట్టణంలో స్వచ్ఛ హిందూపురం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీని ద్వారా మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు శుభ్రత పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారుల దృశ్యం

**బ్రమ్మసముద్రం జూన్ 12 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో "గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక" పైన శిక్షణా కార్యక్రమంను ఈవోపీఆర్డి యోగేష్ ఆధ్వర్యంలో శిక్షణకార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం లో గ్రామ పంచాయతీలు ప్రతి శాఖను కలుపుకొని అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి యోగేష్, మండల విద్యాధికారి ఓబుళపతి, ఏ ఇ సుబ్బారాయుడు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఐసిడిస్ సూపర్వైసోర్, హౌసింగ్ ఏ ఈ ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలే కీలకం

### పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక 2026-27పై మండల స్థాయి శిక్షణలో ఎంపీపీ లక్ష్మిదేవి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ గోవిందు

**శెట్టూరు, జూన్ 12ప్రభాతవార్త**

గ్రామాల సమగ్ర అభివృద్ధికి పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు ఎంతో కీలకమని ఎంపీపీ లక్ష్మీదేవి పేర్కొన్నారు. పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక 2026 27పై మండల స్థాయిలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం మండల సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జిలాని భాషా మాట్లాడుతూ గ్రామాల అవసరాలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధ చర్యలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలోమండల వ్యవసాయఅధికారి వాసుకీరాణి,యంఈఓ.శ్రీధర్ వైద్యఆరోగ్య శాఖ డాక్టర్ నిఖిత వీఓ లీడర్లు,వెలుగు సిబ్బంది సచివాలయ సిబ్బంది ఆర్ డబ్ల్యూ యస్ అధికారిసురేంద్ర ,వివిధ శాఖల అధికారులు పాల్గొని పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై అవగాహన పొందారు.

## మలేరియా నివారణకు ప్రభుత్వ వసతి గృహాలలో ఆల్ఫా సైఫర్ మెత్రిన్"5 స్ప్రేయింగ్ నిర్వహణ



**బెలుగుప్ప, జూన్ 12 ప్రభాత వార్త**

"మలేరియా వ్యాధి నివారణ" ముందస్తు చర్యలలో భాగంగా, జిల్లా మలేరియా అధికారి శ్రీ ఓబులు ఆదేశాల మేరకు గురువారం బెళుగుప్ప డాక్టర్ గి.ప్రియాంక , మలేరియా సుబ్యూనిటీ అధికారి ఎస్. తిరుపాలయ్య ఆధ్వర్యంలో బెళుగుప్ప మండలం బెళుగుప్ప గ్రామములో గల బి.సి బాలుర వసతి గృహం నందు , కేజీ.బీవీ.స్కూల్ , వెంకటాద్రి పల్లి బి .సి బాలుర వసతి గృహాలలో "ఆల్ఫా సైఫర్ మిత్రైన్"ద్రావణంతో ఫోకల్ స్ప్రేయింగ్ చేయించడం జరిగినది. దోమల నివారణ , నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ దోమకాటుకు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్.రీ.వెంకట రమణ ఎం పి హెచ్ ఈ ఓ విజయకుమార్ ,కేజీ.బి.వి.ప్రిన్సిపాల్ నాగారత్నమ్మ, బీసీ.హాస్టల్ వార్డన్ ది.నాగరాజు, ఆరోగ్య కార్యకర్తలు గోవిందు,అజయ్,ఏ.న్.ఎం లు, భాగ్యమ్మ, రుక్మిణి, ఎంఎల్. హేచ్.పి భవాని,ఆశ కార్యకర్తలు,లక్ష్మీదేవి, కవిత,పాల్గొన్నారు.

## కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాలేదు

### -మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్

**ఉరవకొండ, జూన్ 12 ప్రభాతవార్త**

ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాలేదని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల కోసం కొత్త దరఖాస్తులను ఈనెల 12వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారని సమీప స్వర్ణగ్రామ/వార్డు సచివాలయాల్లో జిరాక్స్ ధ్రువపత్రాలు సమర్పించి కొత్త పింఛన్లను మంజూరు చేసుకోవచ్చని సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనలు, నోటీసులు ప్రచారం జరుగుతున్నాయన్నారు. నకిలీ ప్రకటనల ఆధారంగా ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి అర్హత ప్రమాణ పత్రాల కోసం వివిధ కార్యాలయాలకు వెళుతున్నట్లు తెలిసిందన్నారు. పింఛన్లకు సంబంధించిన అధికారిక సమాచారం ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారిక సర్క్యులర్లు, ధృవీకరించిన మార్గాల ద్వారా మాత్రమే విడుదలవుతుందన్నారు. ప్రభుత్వం పలు సేవలను ఇంటివద్దే అందిస్తున్నదని కనుక ప్రజలు కాలాన్ని, డబ్బును వృధా చేసుకోవద్దని ఎంపీడీవో సూచించారు.

## ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మెగా బ్లడ్ బ్యాంక్

### సేవా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే)



రక్తదాన శిబిరంలో కలెక్టర్

**రాయదుర్గం జూన్ 12 ప్రభాతవార్త**

నియోజకవర్గం ఆవులదట్ల గ్రామంలో నిర్వహించిన మెగా బ్లడ్ బ్యాంక్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఆనంద్... ముందుగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ను ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ పుష్ప గుచ్చమిచ్చి స్వాగతం పలికారు... అనంతరం జిల్లా కలెక్టర్ మెగా బ్లడ్ బ్యాంకు ను సందర్శించారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరుగుతున్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రతి ఒక్కరినీ అభినందించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్...... ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ కేపీ కుమార్, జిల్లా జనరల్ సెక్రెటరీ అయుఫ్, అధ్యక్షులు రాయదుర్గం అధ్యక్షులు కమలాక్షుడు, తాలూకా జనరల్ సెక్రటరీ గురుప్రసాద్, ప్రచార కార్యదర్శి ఆవుల మనోహర్, యూనియన్ నాయకులు జర్నలిస్టులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నాగేపల్లిలో పారశుద్యం పడకేసింది



అధ్వానంగా ఉన్న రోడ్లు

**కణేకల్, జూన్ 12 ప్రభాతవార్త**

కణేకల్ మండల పరిధి లోని నాగేపల్లి గ్రామంలో కొత్తగేరి సమీపంలో మురికి కాలవ సౌకర్యం లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా మురికి నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దుర్వాసన వ్యాపించడమే కాకుండా దోమలు అధికంగా పెరిగి విషజ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని స్థానికులు తెలిపారు. పలువురు జ్వరం, జలుబు, వైరల్ వ్యాధులతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న పరిస్థితి నెలకొంది.కొత్తగేరి ప్రాంతంలో మురికి కాలవ నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, వెంటనే కాలవ నిర్మాణం చేపట్టి నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయసింహారెడ్డి

**కణేకల్, జూన్ 12 ప్రభాతవార్త**

కణేకల్ మండల పరిషత్ కార్యాలయంలో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తయారీ, అమలు విధానాలపై గురువారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రణాళికల రూపకల్పన, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించడం వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం, గ్రామ సభల ద్వారా స్థానిక అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులను ఎంపిక చేయడం, వివిధ శాఖల సమన్వయంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై సవివరంగా చర్చించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సమర్థ అమలులో గ్రామ స్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాలని అధికారులు సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో విజయసింహ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమోళి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏ లీడర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిబద్ధతకు సన్మానం



ప్రశంస పత్రం అందుకుంటున్న లైబ్రరియన్ శ్రీనివాసులు

**వజ్రకరూరు జూన్ 12 ప్రభాతవార్త**

గ్రంధాలయశాఖఆధ్వర్యంలో నిర్వహించిన వేసవిశిక్షణశిబిర కార్యక్రమం లో నిబద్ధతగా వ్యవహరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి నందుకు వజ్రకరూర్ లైబ్రరియన్ శ్రీనివాసులు ఉన్నతాధికారులు సన్మానించి, ప్రశంసా పత్రం అందజేశారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలలో శిక్షణ, నైపుణ్యాలను నేర్పించి నందుకు రాష్ట్రస్థాయిలో అవార్డును పొందారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, సెక్రెటరీ శివప్రసాద్ చేతుల మీదుగా ఆయన అవార్డును తీసుకున్నారు. ఈ అవార్డు రావడం తనకు చాలా ఆనందంగా ఉందని, విధులు పట్ల మరింత బాధ్యతను పెంచిందని లైబ్రరియన్ శ్రీనివాసులు అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

### జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



**బెలుగుప్ప జూన్ 12ప్రభాత వార్త**

బెలుగుప్ప మండల పరిధిలోని కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పెద్ద ఎత్తున చేర్పించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేసవి సెలవుల అనంతరం పాఠశాలలో పునర్ ప్రారంభం కాగా బెలుగుప్పమండల పరిధిలో కాలుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థుల అడ్మిషన్లు, ఎన్రోల్మెంట్ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులు పాఠశాలలో చేరారు, ఆరవ తరగతి ఏడవ తరగతి వారీగా ఎంత మంది విద్యార్థులు ఉన్నారు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ఎంతమంది వచ్చారు తదితర వివరాలు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలును అడిగి తెలుసుకున్నారు ఇందులో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు యూనిఫారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ఈరోజు అన్ని పాఠశాలలు తెరుచుకోవడం జరిగిందన్నారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను మరింత మందిని చేర్పించాలని విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన ఎడ్యుకేషన్ అధికారి లక్ష్మన్న ఎంఈఓ లు గోవిందరాజులు ,హరికృష్ణ, పాఠశాల హెడ్మాస్టర్ సుధామణి మండల డిప్యూటీ తాసిల్దార్ గురుబ్రహ్మ, విద్యార్థులు స్కూల్ కమిటీ ఛైర్మన్ సభ్యులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం..

### మనబడి మన పండుగ నిర్వహణ

### విద్యార్థులు లీప్ యాప్ నీ మొబైల్లో డౌన్లోడ్ చేసుకోండి -డిఇఓ జి కృష్ణప్ప



విద్యార్థులక ను ఫ్లవర్ తో స్వాగతం పలుకుతున్న డీఈవో ఎంఈఓ లు దృశ్యం



పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్న డిఈఓ ఎంఈఓలు

**కొత్తచెరువు జూన్ 12 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావలసినటువంటి అన్ని మౌలిక వసతులతో పాటు మంచి విద్యను అందిస్తున్న ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దామని డి ఈ ఓ జి కృష్ణప్ప ఉన్నారు 2026 27 విద్యా సంవత్సరం కు సంబంధించి పాఠశాలలు పున ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి జి కృష్ణప్ప కొత్తచెరువు మండల విద్యాశాఖ అధికారులు జయచంద్ర మరియు డి సోమశేఖర్ నాయుడు తో కలిసి కొత్తచెరువు మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నారేపల్లి మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మైల సముద్రం ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు చాక్లెట్స్ మరియు ఫ్లవర్స్ అందించి ఆ పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలకు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి జి కృష్ణప్ప విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. విద్యార్థులు ఆనందంగా పద్యాలు మరియు రైమ్స్ పాడి వినిపించారు. విద్యార్థులు తల్లిదండ్రులు అందరూ తప్పనిసరిగా లినితిశి యాప్ ను తమ మొబైల్ ఫోన్లో ఇన్స్టాల్ చేసుకుని విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ అందజేశారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**బ్రమ్మసముద్రం జూన్ 12 ప్రభాతవార్త**



రక్తదానం చేస్తున్న దృశ్యం

బ్రమ్మసముద్రం మండలం వేపులపర్తి గ్రామం నందు శుక్రవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగినది దీని యొక్క ముఖ్య ఉద్దేశం తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నటువంటి రోడ్డు ప్రమాద బాధితులకు గర్భిణీ స్త్రీలకు రక్తం ఏ సమయంలోనైనా ఆపద రావచ్చు ఈ ఉద్దేశంతో మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని మీసేవ చన్నమల్ల పేర్కొన్నారు తన 34వ జన్మదిన సందర్భంగా ఈ యొక్క రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు అలాగే ముందు ముందు కూడా ఇలాంటి రక్తనా శిబిరాలు మరింత మంది యువతతో క్యాంపులో కండక్ట్ చేసి రక్త కొరత లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు పోవాలని ఉద్దేశంతో శుక్రవారం అనంతపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ క్యాంప్ ఇంచార్జ్ హరికృష్ణ సార్ తన సిబ్బందితో రావడం జరిగినది అలాగే గ్రామం నందు యువత 25 మంది వరకు తన అమూల్యమైన రక్తాన్ని ఇచ్చి ప్రాణదాతలుగా మిగిలారు.

## వైకాపా ర్యాలీలో పాల్గొన్న మండల నాయకులు

**గుడిబండ జూన్ 12 ప్రభాతవార్త**



ర్యాలీలో పాల్గొన్న డిఎల్ యంజారేగౌడ్

కూటమి ప్రభుత్వ పాలనకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మడకశిర పట్టణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన ర్యాలీలో మండల కన్వీనర్ డిఎల్ యంజారేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వైకాపా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.మడకశిర వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప గుడిబండ మండలం కావడంతో మండలంలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై ర్యాలీకి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి, సంక్షేమం అందలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.ర్యాలీ సందర్భంగా కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసారు .ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలోనే ఉండాలి

### -ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జీ ఎస్.ఖాజా మోయినుద్దీన్

### -జెడ్పీ సెంట్రల్ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహణ



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జీ ఎస్.ఖాజా మోయినుద్దీన్



హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

**ఉరవకొండ, జూన్ 12 ప్రభాతవార్త**

బడిఈడు పిల్లలందరూ తప్పక బడిలోనేఉండాలని అందుకోసం ప్రభుత్వం కంపల్సరీ ఎడ్యుకేషన్ నిర్బంధ విద్యను అమలు చేస్తోందని ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జీ, మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మెన్ ఎస్.ఖాజా మోయినుద్దీన్ అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్బంగా పట్టణంలోని జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా జడ్జీ ఎస్.ఖాజా మోయినుద్దీన్ మాట్లాడుతూ అందరికీ విద్యను అందించడానికి ప్రభుత్వాలు ఎన్నోకార్యక్రమాలు చేడుతున్నాయనివాటిని వినియోగించుకోవాలన్నారు. సమాజంలో విద్యావంతులకు ప్రత్యేకమైన గుర్తింపు, గౌరవం ఉందన్నారు. పిల్లలకు చిన్నతనం నుండే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వివరించారు. పిల్లలపట్ల నేరాలను నియంత్రించడానికి పోక్సో చట్టం అమలులో ఉందన్నారు. పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించడానికిగాను పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బి.మహానంది, ఎంఈవో హెచ్.ఈశ్వరప్ప, అడ్వకేట్ బి.సురేష్, పాఠశాల హెచ్ఎం కె.ఖాధర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులులేని అనాథ పిల్లలు ఉంటే ఆశ్రమంలో చేర్పించండి

### -ఉరవకొండ ఫస్ట్ ఆర్ఫన్స్, ఎడ్యుకేషన్ సర్వీస్ సొసైటీ ప్రసిడెంట్ బి.సురేష్

**ఉరవకొండ, జూన్ 12 ప్రభాతవార్త**

ఉరవకొండ పరిసర ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు లేని, తల్లి లేక తండ్రి లేని, పిల్లల సంరక్షణ బాధ్యతలు తీసుకునేవారెవ్వరూ లేని అనాథ పిల్లలు ఎవరైనా ఉంటే ఉరవకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల అనాథ పిల్లల ఆశ్రమంలో చేర్పించవచ్చని ఉరవకొండ ఫస్ట్ ఆర్ఫన్స్, ఎడ్యుకేషన్ సర్వీస్ సొసైటీ ప్రసిడెంట్ బి.సురేష్ కోరారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించబడుతున్న ఆశ్రమంలో పిల్లలకు మంచి భోజన వసతి, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎల్‌కేజీ నుండి 10వ తరగతి వరకు విద్యాభ్యాసంను ఏవిధమైన ఫీజులేకుండా ఉచితంగాసంస్థద్వారా అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన పిల్లలు ఆశ్రమంలో సీటు పొందుటకు గాను వారి ఆధార్, చనిపోయిన తల్లిదండ్రుల డెత్ సర్టిఫికేట్, స్కూల్ టీసీ, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అప్లికేషన్‌తోపాటు జతపరిచి అందించాలన్నారు. మరిన్ని వివరాలకు ఆశ్రమం నిర్వహకులు బి.సురేష్, వారి బృందం మొబైల్ నంబర్లు 97014 37327, 74161 37327కు సంప్రదించాలని సూచించారు.

## గ్రామాభివృద్ధికి ముందస్తు ప్రణాళిక ముఖ్యం - జడ్పీటీసి ఉమేష్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసి ఉమేష్

**అగళి, జూన్ 12 ప్రభాతవార్త**

గ్రామ పంచాయితీల సమగ్రాభివృద్ధికి ముందస్తు ప్రణాళిక చాలా ముఖ్యమని జడ్పీటీసి ఉమేష్ అన్నారు. గ్రామ పంచాయితీల అభివృద్ధి అనే అంశంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ వీధి దీపాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు, స్మశాన వాటికల ఏర్పాటు, ఇలా 29 అంశాలపై ముందస్తుగానే వచ్చే సంవత్సరానికి ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గత ఏడాది ఉమ్మడి జిల్లాలో అగళి మండలం ప్రథమ స్థానంలో ఉందని, వచ్చే సంవత్సరంలో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గంగాధర్, ఎంఈఓ నాగేంద్ర, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఓ రెడ్డి ప్రకాష్, ఈఓఆర్డి పద్మ, కన్వీనర్ తిప్పేస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, మాజీ ఎంపిపి నరసింహప్ప, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కెంచు యాదవ్, నాయకులు జయరామ్, పంచాయితీ కార్యదర్శిలు, ఉపాధిహామీ సిబ్బంది, డిఆర్‌డిఏ వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

**రామగిరి, జూన్ 12 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రామగిరిలో గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్చులపతి, ఎంపీడీఓ గంగావతి, డిప్యూటీ ఎంపీడీఓలు ప్రవీణ్బాబు, సుబ్రమణ్యం అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.పం చాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలు ఏ విధంగా తయారు చేసుకోవాలి. గ్రామ సభల నిర్వహణ అధికారుల సమన్వయం, ఆయా గ్రామాల నుంచి ప్రజల ద్వారా సమస్యలు దీర్ఘకాలికల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

03ATP12.qxd:03ATP12.qxd 13/06/26 12:14 AM Page 1



# సమ్మర్ క్యాంప్ విజేతలకు అవార్డుల ప్రదానోత్సవం

## - ఉమ్మడి అనంతపురం జిల్లాకు 5 అవార్డులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 12 ప్రభాతవార్త

రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించిన సమ్మర్ క్యాంప్-2026 ముగింపును పురస్కరించుకుని, ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఐదు ప్రతి ష్టాత్మక అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా ఈరోజు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె.శివప్రసాద్ ఆధ్వర్యంలో, చైర్మన్ చాంబర్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేసవి శిబిరాల్లో పిల్లలకు విజ్ఞానాన్ని, నైపుణ్యా లను అందిస్తూ విశేష ప్రతిభ కనబరిచినందుకుగాను జిల్లాలోని ఐదుగురు గ్రంథాలయ అధికారులకు ఈ అవార్డులను అందజేశారు. అవార్డులు అందు కున్న సుజాత -గ్రేడ్1 గ్రంథాలయ అధికారి, గుంతకల్లు, గోవిందు-అసిస్టెంట్ లైబ్రేరియన్, అనంతపురం, కృష్ణ-గ్రేడ్3 గ్రంథాలయ అధికారి, శింగనమల, శ్రీనివా సులు -గ్రేడ్ 3, లైబ్రేరియన్, వజ్రకరూరు, వెంకటేశ్వర్లు-గ్రేడ్ 3, లైబ్రేరి యన్, పెద్దవడుగూరు, ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ మాట్లాడుతూ.. 40 రోజుల పాటు సాగిన సమ్మర్ క్యాంప్‌ను విద్యా ర్థులకు ఎంతో ఉపయోగకరంగా నిర్వ హించడంలో జిల్లా సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి అనంత పురం జిల్లాకు 5 అవార్డులు రావడం గర్వకారణమని, ఇదే ఉత్సాహంతో గ్రంథా లయాల అభివృద్ధికి, పాఠకులను ఆకట్టుకోవడానికి అందరూ మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరి యన్ పోలుగల్లు కమ్మన్న, గ్రంథాలయ ఉద్యోగ సంఘం నాయకులు ప్రతాప్ రెడ్డి, జయరాం, సీనియర్ అసిస్టెంట్ రాజు, జీవన, ఇతర గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డులు అందుకుంటున్న దృశ్యం

# సొంత పార్టీ కన్వీనర్‌పై వైసిపి రాష్ట్ర నేత దాడి

## - చుట్టపు చూపుగా వచ్చి దాడి చేయడంపై కార్యకర్తలు ఆగ్రహం

కదిరి, జూన్ 12 ప్రభాతవార్త

వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమం భాగంగా శుక్రవారం కదిరి నియోజవర్గ సమన్వయకర్త మక్బూల్ ఆధ్వర్యంలో కదిరిలోనిరసన కార్యక్రమం నిర్వహించారు. అయితే నిరసన కార్యక్రమానికి రావడానికి కొద్దిగా ఆలస్యం కావడంతో ఆ పార్టీ రాష్ట్ర నేత కార్యక్రమం ప్రారంభించాలని పట్టుపట్టారు. సమన్వయకర్త వచ్చాకే నిరసన కార్యక్రమం ప్రారంభిస్తామని నల్లచెరువు మండల కన్వీనర్ రవి సూచించడంతో ఒక్కసారిగా ఆ పార్టీ రాష్ట్ర నేత పూల శ్రీనివాస్ రెడ్డి రవికి కాలర్ పట్టుకుని ఆయనపై దాడి చేయడం కార్యకర్తలు ఆందోళన చెందారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీ వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో కార్యకర్తలకు అండగా ఉండి ప్రభుత్వ వ్యతిరేక పోరాటా ల్లో కార్యకర్తలకు మద్దతుగా నిలవాల్సిన రాష్ట్ర నేత విచక్షణ కోల్పోయి ఇలా దాడి చేయడం ఏమిటని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు అ నాయకుని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చుట్టపు చూపుగా నియోజకవర్గ రావడం కార్యకర్తలు విభేదాలు సృష్టించడం ఆయన నైజం అని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు మరో మూడేళ్ల కాలం ఉండగా, ఇప్పుడే ఆ నాయకుడు ఇలా ప్రవర్తిస్తున్నాడంటే ఇలాంటి వ్యక్తికి ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే సామాన్య కార్యకర్తల ప్రశ్నిస్తున్నారు. అందరికీ ఆదర్శంగా నిలవాల్సి న ఆ నాయకుడు సహనం కోల్పోయి రాష్ట్ర నేత పార్టీ ఫ్లెక్సీ ని అందరి ముందు బహిరంగంగానే చింపివేసినట్లు పట్టణంలో సర్వ త్ర చర్చ జరుగుతోంది. కనీసం కష్టం వస్తే కార్యకర్తలకు అందుబాటులో ఉండడు. నియోజకవర్గానికి ఎప్పుడు వస్తాడు ఎప్పుడు పోతాడు ఎవరికి తెలియని అయోమయ పరిస్థితి ఆ రాష్ట్ర నేతది. అధిష్టాన స్పందించి ఇలాంటి నేతలు చెక్ పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు.

# హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైమ్ జూన్ 12 ప్రభాతవార్త

పాల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని హావలిగి గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో నేరం రుజువైనందున ముద్దాయికి 03 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ 5,000 జరిమానా విధిస్తూ అనంతపురం శితిలీరి కోర్టు జడ్జి పద్మ శుక్రవారం తీర్పు వెలువరించారు.

పాల్తూరు మండలం, హావలిగి గ్రామానికి చెందిన నీరుగంటి ఆంజనేయులు 08/03/2022 తేదీ రాత్రి 9 గంటల సమయంలో మద్యం సేవించి, అర్ధ నగ్నంగా ఇంటి ముందు నిలబడి ఫిర్యాదుదారుడిని,అతని భార్యను అసభ్య పదజాలంతో తిట్టాడు. ముద్దాయి ఇంట్లో ఉన్న కత్తి తీసుకొచ్చి "నిన్ను చంపితే దిక్కెవరు?" అని చెపుతూ ఫిర్యాదుదారుడిపై కత్తితో గొంతుపై పొడవడానికి ప్రయత్నించగా ఫిర్యాదుదారుడు వెనుకకు జరిగి తన చేతిని అడ్డుపెట్టగా మోచేతి నుంచి మణికట్టు వరకు రక్త గాయం కలుగ చేసి తీవ్రంగా గాయపరిచాడు.

ఈ ఘటనపై పాల్తూరు పోలీస్ స్టేషన్‌లో కింద కేసు నమోదైంది.

ఈ కేసును అప్పటి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, తదనంతరం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. గోపాలుడువిచారణ పూర్తి చేసి కోర్టులో పక్కా ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రామ్ నాయక్ విజయ్ కుమార్ గారు కోర్టులో బలమైన వాదనలు వినిపించి, ముద్దాయికి శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించారు. నేరం పూర్తిగా రుజువు కావడంతో న్యాయమూర్తి ముద్దాయి ఆంజనేయులుకు 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని యెడల అదనపు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది.

# యోగాభ్యసనాల కార్యక్రమం

నంబులపూలకుంట,

జూన్ 12 ప్రభాతవార్త

ఎన్.పి.కుంట మండల కేంద్రం లోని జెడ్పీహెచ్ఎస్, ఎన్.పి.కుంట పాఠశా లలో విద్యార్థుల చేత యోగాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్, ఎంఈఓ2 సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే పాఠశాల ప్రధానో పాధ్యాయులు మోహన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యా యినుల సమక్షంలో విద్యార్థులు ఉత్సాహంగా యోగాభ్యాసం నిర్వహించారు. యోగ ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అధికారులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా యోగ సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాధ్యాయులు, ఎం.సందీప్ కుమార్, రవణయ్య, తెలుగు ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



యోగాభ్యసనాలు చేయిస్తున్న దృశ్యం

# మనబడి మన పండుగ

అనంతపురం న్యూటౌన్, జూన్ 12 ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణదేవ రాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో మనబడి మన పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు రావడం జరిగినది. ఈ సందర్భంగా మన బడి మన పండుగ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలో ఉన్న టువంటి సౌకర్యాల కన్నా మెరుగ్గా ఉన్నాయి. ఉచితంగా పుస్తకాలు, బ్యాగు, రాగిజావ, రుచికరమైన మధ్యాహ్న భోజనము కల్పించబడినవి. అదేవిధంగా నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత బోధన జరుగును. క్రీడలు, ఆట స్థలం తదితర సౌకర్యాలు చాలా చక్కగా ఉన్నాయి అని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుని శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# తప్పనిసరి టెట్‌పై రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి ఫోర్టో శ్రీకారం

అనంతపురం న్యూటౌన్, జూన్ 12 ప్రభాతవార్త

అంతర్జాలంలో ఫోర్టో ( ఫోరం ఆఫ్ రిజిస్టర్ టీచర్ ఆర్గనైజేషన్స్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులపై తప్పనిసరి టెట్ ఉత్తీర్ణత నిబంధన అమలుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఫోర్టో రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించింది. సంస్థ కార్యవర్గ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలు ఆమోదించినట్లు నాయకులు తెలిపారు. జూన్ 13, 14 తేదీలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జూన్ 15, 16 తేదీలలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపింది. జూన్ 20 నుంచి పార్లమెంట్ సభ్యులకు వినతిపత్రాలు అందజేసి విద్యాహక్కు చట్టంలో సవరణలు తీసుకురావాలని కోరనున్నట్లు వెల్లడించింది. డా.డి.శ్రీనును వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, మాగంటి శ్రీనివాసరావును వర్కింగ్ జనరల్ సెక్రెట రీగా నియమించినట్లు ఫోర్టో ప్రకటించింది. ఈ సమావేశంలో గాండ్లపర్తి శివానందరెడ్డి, డాక్టర్ డి.శీను, మాగంటి శ్రీనివాస్ రావు, బృందబాన్ డొల్లై, నరసింహారెడ్డి, రమేష్, మీరయ్య, పిసిని వసంతరావు, పిడుగు శ్రీనివాసులు, దొడ్డ రమేష్, రామకృష్ణారెడ్డి, జ్ఞానేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం - ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, జూన్ 12 ప్రభాతవార్త

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికా రులతో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాంధ్ర- 2026 లో భాగంగా జరుగుతున్న యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ విజయ్ కుమార్, అక్బర్ పరిపాలన అధికారి నాగభూషణరెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది, ఎంపి డిఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఎంపిడిఓ భాస్కర్ అధికారులు

# గ్రామ పంచాయితీ అభివృద్ది పై శిక్షణా తరగతులు

బుక్కరాయసముద్రం జూన్ 12 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంపిడివో సదాశివ అధ్యక్షతన గ్రామ పంచాయితి అభివృద్ది ప్రణాళిక పై 2026-27 సంవత్సరానికి సంబందించి, పంచాయితీ కార్యదర్శి లకు, సచివాలం డి.ఏ లకు,సచి వాలం వెల్ఫేర్ అసిస్టె ంట్, ఇంజనీర్ల కు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిణాతరగతుల్లో పంచాయితీల అభివృద్ధికి రావలసిన నిధులు ఏమిన్నాయి కేంద్రం రాష్ట్రం,జిల్లా పరిషత్ నుండి వచ్చే నిధలపై సమీక్షించి పంచాయితీ అభివృద్ధికి ఏవిధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలి వాటి తోపాటు ప్రజలు చెల్లించవలసిన పన్నుల వాటిగురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిడివో సదాశివ తోపాటు,ఎంఇవో లింగానాయక్, పంచాయితీ కార్యదర్శిలు సిద్దరాం పురం రామాంజినేయులు, నవ్య, మల్లికార్జున తదితిరులు పాల్గొన్నారు.



శిక్షణాతరగతుల్లో మాట్లడుతున్న ఇన్‌చార్జి ఎంపిడివో సదాశివ

# సిఐ ని కలిసిన టిడిపి బిజెపి నాయకులు

బుక్కరాయసముద్రం,

జూన్ 12 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల సిఐగా బాధ్యతలు చేపట్టిన సుబ్బరాయుడు ను మర్యాదపూర్వకంగా శుక్రవారం టిడిపి,బిజెపి నాయకులు సిఐ ని శాలువా,బొకేలతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు బండి ఆదినారాయణ,మండల నాయకులు జొన్న రామయ్య,పెద్దప్ప,ఈశ్వరయ్య,ఎంపీపీ భర్త బుల్లే నారాయణస్వామి,మాజీ సర్పంచులు నాగార్జున,మల్లికార్జున,కొర్రపాడు ఆదినారాయణ,సంజీవపురం గోవిందురెడ్డి,నారాయణస్వామి, బొమ్మలాట పల్లిశివారెడ్డి,వెంకటరెడ్డి, ఈశ్వరయ్య,నాగలింగ, గంపన్న,చంద్ర,తోపాటు బిజెపి నాయకులు బిజెపి మం డల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి,నాయకులు మాజీ సర్పంచు పూలకుంట అక్కులప్ప ,రామానాయుడు, సుధాకర్, మధుసూద న్‌రెడ్డి, నారాయణస్వామి,చంద్రమౌళి,శ్రీధర్ తదితిరులు పాల్గొన్నారు.



సిఐని కలసిన టిడిపి,బిజెపి నాయకులు

# షిరిడి సాయిబాబా గుడి నిర్మాణానికి రూ. 10 వేలు విరాళం అందించిన రాగి మురళి.

అనంతపురం రూరల్, జూన్ 12 ప్రభాతవార్త :అనంతపూర్ రూరల్ మండలం అకుతోటపల్లి గ్రామంలో యన్ టీ స్ కాలనీ లో శ్రీ శిరిడీ సాయిబాబు గుడి నిర్మాణ చేస్తున్న సందర్భంగా టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జి రాగే మురళి తనవంతు రూ, ,10000 / పది వేల రూపా యలు గుడి ఆలయ కమిటీ అధ్యక్షులు జ్యోతికి అందజేశారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు అనిల్ చౌదరిపూలనారాయణస్వామి,ప్రవీణ్ గౌడ్ మండల చంద్రశేఖర్ పూల నాగరాజు కుమ్మర రామకృష్ణ,నవీన్ గౌడ్ పాల్గొన్నారు.



గుడి ధర్మకర్తకు నగదు అందజేస్తున్న దృశ్యం.

# ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని - ఎంపీడీఓ తేజోష్ణ

## - గ్రామపంచాయతీ అభివృద్ది ప్రణాళికపై శిక్షణ

పామిడి, జూన్ 12 ప్రభాతవార్త

ప్రభుత్వ లక్ష్యాలను సాధించటానికి కృషి చేయాలని ఎంపీడీఓ తేజోష్ణ పేర్కొన్నారు. ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2026-27 మేరకు గ్రామపంచాయతీ అభివృద్ది, బ్లాక్ పంచాయతీ అభివృద్ది ప్రణాళిక తయారు చేయటంలో బాగంగా శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఎంపీడీఓ తేజోష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయాల్సి న మనందరిపై ఉందన్నారు. ఆర్‌జీఎస్ఏ అన్నది భారత ప్రభుత్వం పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ద్వార ప్రవేశపెట్టిన ఒక ముఖ్యమైన కేంద్ర ప్రాయోజిత పథకం అంటూ పంచాయతీరాజ్ సంస్థల బలోపేతం చేయటం, సుపరిపాలన అందించటం, గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించటమే ముఖ్యఉద్దేశ్యం అని తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అంటే ప్రతి గ్రామం స్థానిక అవసరాలు, వనరుల ఆధారంగా సమగ్రంగా తయారు చేసుకునే ఒక వార్షిక ప్రణాళిక అన్నారు. బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అనేక పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల స్థాయిలో సమగ్ర గ్రామీణాభివృద్ధి కోసం రూపొందించే వార్షిక ప్రణాళికని తెలియజేస్తూ మండల పరిదిలోని గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సమన్వయం చేసి జిల్లా గ్రామాల మధ్య అనుసంధానంగా పని చేస్తుందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు అశ్వర్థమనాయుడు, రంగనాయకులు, ఏఓ హరినాథ్, గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# .రాప్తాడులో రెండేళ్ల వెన్నుపోట్టు గ్రాండ్ సక్సెస్.

## - రాబోయే ఎన్నికల్లో వచ్చేది వైఎస్ఆర్సిపి నే - రాప్తాడు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం రూరల్, జూన్ 12 ప్రభాతవార్త :

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమం రాప్తాడు నియోజకవర్గంలో ఘనవిజ యాన్ని సాధించింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా వేలాదిమంది పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు కార్యక్రమానికి తరలివచ్చారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగానిలి చారు. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డులోని నరిగమ్మ ఆలయం నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగిన ఈ ర్యాలీలో వేలాదిమంది కార్యకర్తలు అడుగుల్లో అడుగులు వేస్తూ పాల్గొన్నారు. జాతీయ రహదారి-44 వరకు సాగిన ర్యాలీతో కళ్యాణదుర్గం రోడ్ జనసంద్రంగా మారింది.ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు విద్రోహానికి రెండేళ్లు, వినాసనానికి రెండేళ్లు అన్నారు. రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్ హామీలు 'సూపర్ తుస్‌గా మారాయని విమర్శించారు. డ్వాక్రా రుణమాఫీ అమలు కాకపోగా మహిళా సంఘా లేకనుమరుగవుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో ఇప్పటికే 25 శాతం డ్వాక్రాసంఘాలు రద్దయ్యాయని ఆరోపించారు.ఎన్టీఆర్‌తో ప్రారంభమైన చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలు నేడు రాష్ట్ర ప్రజల గుండెలపై గాయాలు చేసే స్థాయికి చేరాయని విమర్శించారు.నిరుద్యోగులను నిలువునా ముంచారు. పతప్పుబచ్చ యువగళంతో నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదుకాని ఆయనకు మాత్రం మంత్రి ఉద్యోగం వచ్చింది. రెండేళ్లలో రైతుల గురించి పట్టించుకునే నాథుడే లేడు. చంద్రబాబు ప్రభుత్వంలో వర్షాలు లేక అల్లాడుతుంటే పండిన అరకొర పంటలకు గిట్టుబాటు ధరలేదు. వేరుశనగకు మినహా ఏ ఒక్క పంటకూ మార్కెట్‌లో ధరలేక అల్లాడిపోతున్నారు. ఈ రెండేళ్లలో రాష్ట్రంలో ఎన్నో మోసాలు, అన్యాయాలు జరిగాయి. డీఎస్సీలో 15 లక్షలకు ఒక ఉద్యోగం అమ్ముకున్నారు. పచ్చకండువాలు, పచ్చనోట్లకుఅమ్ముడుపోయిన ఈ డీఎస్సీ...దగా డీఎస్సీ. సూపర్ సిక్స్ రెండేళ్లలో సూపర్ తుస్ అయింది. ప్రతి మహిళకు నెలకు 1500 అని చెప్పి మోసం చేశారు. గతంలో జగనన్న డ్వాక్రా రుణాలు మాఫీ చేశారు. ఇప్పుడు చంద్రబాబు నిర్వాహకంతో డ్వాక్రా సంఘాలుమాఫీఅవుతున్నాయి. రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటికే 40 శాతం సంఘాలునిర్వీర్య మయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 25 శాతం సంఘాలు మూతపడ్డాయి. రాష్ట్రంలో రైతులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, వైఎస్సార్‌సీపీ హయాంలో పేరూరు డ్యాం నీటిని తీసుకొచ్చి వేలాది మందిరైతులనుఆదుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం తాగునీటి కోసం ప్రజలు అడుగుతున్నా స్పందనలేకుండా భూకబ్జాల కుపాల్పడుతున్నారని ఆరోపించారు. 'మేము నీళ్ల పారిస్తేవా ళ్లురక్తంపారిస్తున్నారు అంటూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు.రాప్తాడు నియోజకవర్గంలో ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, రాక్షసపాలన కొనసాగుతోందని అన్నారు. దగాకోరు, వంచన ప్రభుత్వానికి పాలన కొనసాగించే అర్హత లేదని, అన్ని వర్గాల ప్రజలు సంఘటితమై ఈ ప్రభుత్వాన్ని గద్దెదించాలనిపిలుపునిచ్చారు. కొన్ని పోలీస్‌స్టేషన్లలో చట్టబద్ధ పరిపాలనకు బదులుగా పంచాయితీల ఎనిర్వహిస్తున్నారని ,మహిళల నుఅడ్డుపెట్టుకుని హనీట్రాప్‌ల ద్వారా డబ్బులుసంపాది స్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. గౌరవంగా బతకడం చేతగాకపోతే అధికారంలో ఉండాల్సి న అవసరం లేదని, బిక్షమెత్తుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పరిటాల సునీత కుటుంబంపై కూడా తీవ్ర విమర్శలు చేసిన ప్రకాష్‌రెడ్డి, ధర్మవరం, అనంతపురం రూరల్ ప్రాంతాలను ఆమె కుమారులు దోపిడీకి వేదికగా మార్చారని ఆరోపించారు. సోదరులుదోపిడీ చేస్తున్నారన్నారు. కురుబ మజ్జిగ లింగమయ్య హత్య ఘటనపై ఎంపీపార్థసారథిస్పందించాలని డిమాండ్ చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో కురుబ కులస్తుడిని హత్య చేస్తే పెనుకొండలో పరిటాల రవీంద్ర విగ్రహాన్ని మంత్రి సవిత ఏర్పాటు చేశారన్నారు. కురుబ సమాజానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, మీ ఆశీర్వా దంతో పేదలకు సేవ చేస్తానని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి ఫ్యాన్ గాలికి టీడీపీ కొట్టుకుపోవడం ఖాయ మని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీ లు, మండల కన్వీనర్లు, మాజీ పీఏసీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.



సమావేశానికి హాజరైన నాయకులు

# వంచన కార్యక్రమానికి మద్దతు వైసిపి మండల కన్వీనర్ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ

నల్లచెరువు జూన్: 12 ప్రభాతవార్త,

వైయస్సార్సీపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కదిరి వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నయ వంచనకు రెండేళ్లు అనే కార్యక్రమానికి మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మద్దతుగా తన నివాసం నుండి వందలాది బైకుల్లో బైకు ర్యాలీ నిర్వహించి జై జగన్ జై జగన్ అంటూ నినాదాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసి పీఠం ఎక్కిందని ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని కూడా అమలు పరచకుండా తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రానున్న సాధారణ ఎన్నికల్లో వైయస్సార్సీపీ ఘనవిజయం సాధిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. కదిరిలో నిర్వహిస్తున్న నయన వంచనకు రెండేళ్లు కార్యక్రమానికి తరలి వెళ్లారు. కార్యక్రమానికి తరలి వెళ్లిన వారిలో వైయస్సార్సీపి రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి. రాష్ట్ర వైఎస్సార్సీపి రైతు విభాగం సంయుక్త కార్యదర్శి పో రెడ్డి వెంకటరెడ్డి. రాష్ట్ర పంచాయతీరాజ్ ఫోర్డ్ పర్సన్ యనమల ఆనంద్ రెడ్డి.రమణారెడ్డి. నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు హైటెక్ రమణ. మండల యూత్ ప్రెసిడెంట్ మన్సూర్. మండల కార్యదర్శి బాలు నాయక్. మైనారిటీ నాయకులు నజీర్. బావా ఖాన్. మాజీ సర్పంచులు యూసుఫ్. రమణారెడ్డి.అక్కులప్ప.వైయస్సార్సీపి సోషల్ మీడియా విభాగం అమరనాథ్ రెడ్డి.లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న, మండల కన్వీనర్ మండెం రవి కుమార్ రెడ్డి



వైసీపీ కార్యకర్తలతోటి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కన్వీనర్

# నాటు వైద్య పరికరాలకు నిప్పంటించిన దుండగులు

నల్లచెరువు జూన్ : 12 ప్రభాతవార్త,

మండల కేంద్రంలోని జెండాయాపమాను వద్ద ఉన్న రంగప్ప నివాసం నందు శుక్రవారం పట్టపగులు గుర్తు తెలియని వ్యక్తులు నాటు వైద్యం పరికరాలకు నిప్పంటించారు బాధితుడు లబోదిబోమంటూ కన్నీరు తంత పెడుతూ. 1,50,000 విలువ చేసే మందులు పరికరాలు కాలి పోయాయని పొట్టకూటి కోసం నాటువైద్యం తో జీవనం సాగించుకుంటూ కుటుంబాన్ని పోషించుకు ంటున్నామని మందులన్నీ అగ్నికి ఆహుతి కావడంతో జీవనాధారం బరువు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.



అగ్నికి ఆహుతైన నాటు వైద్య పరికరాలు

# నేడు ఆపరేషన్ దండయాన పై అవగావాన

## హాజరుకానున్న ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధురారెడ్డి

ఓబుళదేవరచెరువు, జూన్ 12, ప్రభాతవార్త స్థానిక వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీ సత్యసాయి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఆపరేషన్ దండయాన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎస్సై మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా శ్రీ సత్య సాయి జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ఎస్ సతీష్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు వాల్మీకి సర్కిల్ నుండి వశిష్ట స్కూల్ వరకు ర్యాలీ అనంతరం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఆపరేషన్ దండయాన కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలల భద్రత పట్ల వివరిస్తారని ఎస్సై మల్లికార్జున రెడ్డి తెలియజేశారు.

# అమ్మవారికి విశేష అలంకరణ..

గార్లదిన్నె,జూన్ 12, ప్రభాత వార్త :

అధిక జ్యేష్ఠ మాసం సందర్భంగా శుక్రవారం కల్లూరు గ్రామంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి 120 చీరలతో విశేషంగా అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక ంగా అలంకరించగా, అమ్మవా రు అత్యంత శోభాయమానంగా భక్తులకు దర్శనమి చ్చారు .ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సు లు పొందారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది..



.120 చీరలతో వాసవి కన్యకా పరమేశ్వరి

# పామిడిలో భారీ వర్షం

## - జలమయమైన కాలనీలు - బిసిసి, హనుమాన్ థియేటర్ రోడ్లపై ఉధృతంగా ప్రవహించిన వర్షపునీరు

పామిడి, జూన్ 12 ప్రభాతవవార్త

పామిడిలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు జలమయమవ్వగా ప్రధాన రహదారులైన బిసిసి, హనుమాన్ థియేటర్ రోడ్లపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. పట్టణంలోని వ పొంగిపొర్లటం ఫలితంగా బిసిసి, హనుమాన్ థియేటర్ రోడ్లపై మురుగునీరంతా వర్షపునీటితో ఉధృత ంగా ప్రవహించటం గమనార్హం. వివిధ కాలనీల్లో వర్షపునీరు ప్రవహించటం గృహాల్లోకి సైతం నీరు చేరటం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దకాలువ, డ్రైనేజీ కాలువలు అస్థవ్యస్థంగా తయారవ్వటం మురుగునీరు ముందుకెళ్ళకుండా స్తంభించి పోవటం తో ప్రస్తుతం కురిసిన భారీ వర్షానికి మురుగునీటితో వర్షపునీటితో అధ్వాన్నంగా తయారైంది.

# తాడిపత్రిలో ప్రజా స్వామ్యాన్ని కాపాడండి

**మొదటిపేజీ తరువాయి...** తేల్చుకునేందుకు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ కూటమి పాలన రెండేళ్ల వైఫల్యాలపై వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి కోసం 9వ తేది జిల్లా ఎస్పీకి మెయిల్ చేశామన్నారు. అయితే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోగా శుక్రవారం తెల్లవారు జామున స్థానిక పోలీసులు వచ్చి తనను కార్యక్రమం నిర్వహించేందుకు వీలు లేదంటూ అనంతపురంకి తరలించారన్నారు.

పోలీసుల వైఖరికి నిరస నగా ఎస్పీ కార్యాలయం ఎదుట బైటాయించా మన్నా రు. తాడిపత్రిలో పోలీసులు టిడిపి నేతలు చెప్పి న రీతిలోనేనడుచుకుంటున్నారని, వైసిపి ఏ కార్యక్రమం చేపట్టినా అడ్డకుంటున్నారని విమర్శించారు. తమ కార్యక్రమానికి అనుమతించకపోగా టిడిపి నేతలకు బైక్ ర్యాలీకి అనుమతించారని వారు బైక్ ర్యాలీగా కాకుండా నడచుకుంటూ తన ఇంటి వద్దకు వచ్చే ప్రయత్నం చేశారన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి తన ఇంటికి వచ్చినా, తన ఇంటిని కూల్చినా అడ్డుకోబోనని, రాబోయే రోజుల్లో చట్టపరంగానే ఎదర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. తాడిపత్రి పోలీసులు కూడా వైసిపి నేతలకు రక్షణ ఇవ్వకున్నా పర్లేదని అసాంఘీక కార్యకలాపాలు అధికమయ్యాయని, కనీసం వాటినైనా అడ్డుకుని లాండ్ ఆర్డర్‌ను కాపాడాలని ఆయన సూచించారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నంత వరకు తాను ఎవరికీ భయపడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులను కాపాడుకునేందుకు చట్టపరంగానే పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున పార్టీ నేతలతో కలిసి ఎండను సైతం లెక్క చేయకుండా ధర్నా నిర్వహించగా ఎస్పీ సమావేశంలో ఉన్నారని డివిస్పి వచ్చి వైసిపి నేతలతో చర్చించారు. రాబోవు రోజుల్లో వైసిపి నిర్వహించే కార్యక్రమాలకు అడ్డుకోబోమని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో పలువురు వైసిపి రాష్ట్ర, జిల్లా నేతలతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుల బస్సుపై వైసీపీ నాయకుల దాడి

**మొదటిపేజీ తరువాయి...** సురేంద్ర బాబు డిమాండ్ చేసారు. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ తిరుపతిలో జరుగుతుంటే రాష్ట్రం మొత్తం టీడీపీ నాయకులు పార్టీ జండాలు, కండువాలతో విజయోత్సవ ర్యాలీలు జరుగుతాయన్నారు. వైసీపీ గుండాలు అడ్డుకోవడం చూస్తే ప్రతిపక్షంలో కూడా దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. నిన్నటి రోజున జగన్ విశాఖ స్టీల్ ప్లాంట్ బాధితులను పరామర్శించేందుకు వెళ్లి డబ్బులిచ్చి జనాలను తెచ్చుకుని నినాదాలు చేయించుకున్నారని, అలాంటి నాయకులను చూసి ఇక్కడ కూడా అలాగే చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. కాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నా అలాంటి విష సంస్కృతికి తావు ఇవ్వకూడదని బావించే వ్యక్తి కాబట్టి ప్రకాష్ రెడ్డి అనుచరులు దాడికి పాల్పడిన వారిపై దాడులకు ప్రయత్నించలేదని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ హామీ ఇచ్చారని తెలిపారు..

**CHANGE OF SURNAME**

I, SYEDA KHURSHEED BEGUM (old name) W/o. SYED NAZEER AHMED, D.No. 6-1-782-5, Kovur Nagar, Anantapur-515001, Anantapur Dt. A.P. State, I have changed my Surname from SYEDA KHURSHEED BEGUM (old name) to SYED KHURSHEED BEGUM (new name). Hence forth, I am being SYED KHURSHEED BEGUM for all transactions.

**CHANGE OF NAME**

I **MOHAMMAED FAREED BABA** (Old Name) S/o KALIGAR HUSSAIN BASHA R/at H.No.1-274-2-c-6, Kasthuribi Street, Kadiri town and Muncipality, Sri Sathyasai District. Changing my Name From **MOHAMMED FAREED BABA**(Old Name) to **KALIGAR MAHAMMAD FAREED** (New Name) Hence forth, Iam being called as **KALIGAR MAHAMMAD FAREED** for all Purpose.

# రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

## - విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి





ఎమ్మెల్యే పరిటాల సునీత సదస్సులో పాల్గొన్న దృశ్యాలు

రాప్తాడు, జూన్ 12 ప్రభాతవార్త

ధర్మవరం నియోజకవర్గాల్లో విద్యు త్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికు మార్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పూర్తైన సందర్భంగా రెండేళ్ల నమ్మ కం, అభివృద్ధి, సంక్షేమం పేరుతో తిరుపతిలోని దామినేడులో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే సునీత పాల్గొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటితో పాటు పలువురు మంత్రులతో భేటి అయ్యారు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ సమస్య లను మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా కొత్త సబ్ స్టేషన్లు మంజూరు, పెండింగ్‌లో ఉన్న 485 విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేయడంతో పాటు 1520 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. 366 కిలోమీటర్లు మేర ఎల్.టి. కేబుల్, 161 కిలోమీటర్లు కండ క్టర్, 4వేల 8వందల కరెంట్ పోల్స్ మంజూరు చేయాలి కోరారు. అలాగే 6మండలాలలో విద్యుత్తు ఏఈ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. 6సెక్షన్లలో మెరుగైన విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడానికి ఒక్కొక్క సెక్షన్‌లో 5 నుంచి 6 మంది ఫీల్డ్ అసిస్టెంట్స్ నియామకం కూడా చేపట్టాల్సి న అవసరం ఉందన్నారు. అలాగే కారుణ్య నియామకాల గురించి కూడా ప్రస్తావించారు. ఇటు ధర్మవరం నియోజకవర్గంలోని సమస్యలను కూడా పరిటాల శ్రీరామ్ తరుపున మంత్రికి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ధర్మవరం రూరల్, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాలలో దరఖాస్తు చేసుకున్న రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సునీత చెప్పిన అంశాలపై మంత్రి గొట్టిపాటి సానుకూ లంగా స్పందించారు. వెంటనే వీటన్నింటినీ పరిశీలిం చాలని సీఎండీని ఆదేశించారు. అలాగే సీఎండీ కి కూడా రెండు నియోజక వర్గాల తరుపున వినతి పత్రాలు అందజేశారు. మరోవైపు రెండేళ్ల నమ్మకం బహిరంగసభలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం వైసీపీ నేతల కళ్లకు కనిపించడం లేదని విమర్శలు చేశారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్‌తో పాటు అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నార న్నారు. పెట్టుబడులు కూడా రాష్ట్రానికి పెద్ద ఎత్తున వస్తున్నాయని వీటిని జీర్ణించుకోలేకనే వైసీపీ నిరసన కార్యక్రమాలు చేస్తోందన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో కూటమిని గెలిపించారో దానిని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

# చంద్రబాబు పాలన దోపిడి, అవినీతి, అక్రమాలు, వేధింపుల మయం..!

## - మెగా డీఎస్సీ పేరుతో ఉపాధ్యాయ పోస్టులను అంగట్లో పెట్టి అమ్ముకున్నారు - పోలీస్ వ్యవస్థలో పారదర్శకత లోపించి అవినీతిలో భాగస్వాములవుతున్నారు - ఇష్టారాజ్యంగా ఊరూరా బెల్టుషాపులతో మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేస్తున్నారు - మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి - ఉరవకొండలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' భారీ నిరసన ప్రదర్శన



ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యం లో జరిగిన చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు

ఉరవకొండ, జూన్ 12 ప్రభాతవార్త

రాష్ట్రంలో చంద్రబాబు పాలన సహజ వనరుల దోపిడి, అన్ని ంటా అవినీతి, అక్రమాలు, ఇదేమని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, వేధింపులతో కొనసాగు తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వే శ్వరరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్మోహ న్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' భారీ నిరసన ప్రదర్శన నిర్వహించగా పార్టీ పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. స్థానిక మార్కండేయస్వామి ఆలయం వద్ద నుండి పార్టీ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నల్లబెలూన్లు ఎగురవేస్తూ చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాత బళ్లారి రోడ్డు గుండా క్లాక్‌టవర్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలనుద్దేశించి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నాలుగైదు బెల్టు షాపులతో నాశిరకం మద్యాన్ని అమ్మిస్తూ చంద్రబాబు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని వాపోయారు. టీచర్ పోస్టుల భర్తీ అంటూ మెగా డీఎస్సీ నిర్వహించి స్పోర్ట్స్ కోటా పోస్టులను అంగట్లో సరుకులు మాదిరి 10, 15 లక్షలకు విక్రయిం చుకు న్నారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వై.ఎస్.జగన్మో హన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి 1.30 లక్షల ఉద్యోగాలు, ఆసుప త్రులు, ఇతరత్రా శాఖల్లో మరో 45వేల ఉద్యోగాలను అత్యంత పాదర్శకంగా నియామకాలు చేపట్టగా కేవలం 16,000 టీచర్ పోస్టుల భర్తీకు నిర్వహించిన మెగా డీఎస్సీను అంతులేని అక్రమాలకు నిలయంగా నేడు చంద్రబాబు ప్రభుత్వం నిలిపిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభు త్వంలో ఐదేళ్లలో 3.5 లక్షల కోట్లు అప్పులు తెచ్చి 2.5 లక్షల కోట్లను నేరుగా లబ్దిదారులకు వివిధ పథకాల కింద పంపిణీ చేస్తే నేటి కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలో 3.6 లక్షలు కోట్లు అప్పులు చేసి ఆ డబ్బును ఏం చేసిందో చెప్పడంలేదన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి లాంటి సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడిందన్నారు. ఉపాధి హామీలో అంతులేని అవినీతి జరుగుతోందని అధికార పార్టీ నాయకులు మేట్ల అవతారమెత్తి కూలిడబ్బులు దోచుకుంటున్నారన్నారు. నమ్మించి ఓట్లేసిన ప్రజలకు చంద్రబాబు రెండేళ్ల పాలన వెన్నుపోట్లతో కొనసాగిందని వారికి సంబరాలు చేసుకునే హక్కు లేదన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఇటీవల దివంగత సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫ్యాక్షన్‌ను పెంచి పోషిం చారని, గొడ్డలి పార్టీ సమాజానికి హానికరమని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పోటీ చేయకుండా గ్రామల్లో యాక్టివ్‌గా ఉన్న నాయకులను పోలీసుల చేత పోలీస్ స్టేషన్‌కు రప్పించి వార్నింగులు ఇప్పిస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఎం.నరసింహులు, కరణం పుష్పావతి, ఆర్.దేవిబాయి, ఎం.నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఏ.సి.పార్వ తమ్మ, పార్టీ నాయకులు కె.వి.రమణ, సి.పి.వీరన్న, ఈడిగ ప్రసాద్, జి.ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, ఎం.అశోక్‌కుమార్, బోయ సుశీ లమ్మ, ఎం.లలితమ్మ, ఓబుళమ్మ, మోనాలిసా, ఎం.బసవరాజు, ఏ.సి.ఎర్రి స్వామి, ఎస్.తిప ్పయ్య, కౌడికి గోవిందు, సోమశేఖర్‌రెడ్డి, కురుబ రమేష్, కరణం భీమరెడ్డి, హావళిగి భరత్‌రెడ్డి, మల్లెల జగదీష్, వశికేరి మల్లికార్జున, డిష్ సురేష్, ఈశ్వర్, కూరురు వెంకటేష్, వడ్డే ఆంజినేయులు, బి.ఆసీఫ్, జోగి అంజి, గందోడి మారేష్, వన్నూరుసాబ్, బషీర్, బెలగల్ షమ్ము, మంజునాథ్‌రెడ్డి, సాకే పురుషోత్తం, తిరుపాల్, జోగి విజయ్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కూటమి రెండు సంవత్సరాలు విజయవంతంగా పాలన

## హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథి



విద్యాశాఖ మంత్రి లోకేష్ నాయుడుతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధులు

పెనుకొండ జూన్ 12 ప్రభాతవార్త

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు విజయవంతంగా పాలన పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం తిరుపతిలో జరిగిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి పై ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు ఆధ్వర్యంలో విజయోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి పాల్గొన్న ప్రజా ప్రతినిధులు మంత్రి సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కె పార్థసారథి, మాజీ మంత్రులు ఎమ్మెల్యే లు పరిటాల సునీత, కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సమకోటి ఆదినారాయణ లు కలిసి కార్యక్రమం విజయవంతమైనందుకు అభినందనలు తెలిపారు. తిరుపతిలో జరిగిన ఈ కార్యక్రమం పై ఎంపీ బీకే పార్థసారథి ప్రభాతవార్తకు తెలుపుతూ కూటమి పాలన రెండేళ్లలో రూ.65000 కోట్లకు పైగా పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని, ఆడపడుచులకు 4.26 కోట్ల రూపాయలతో ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిం చడం జరిగిందని, దాదాపు 23 లక్షల కోట్ల పెట్టుబడులు, ఇరవై ఒక్క లక్షల ఉద్యోగ అవకాశాలు, 269 అన్న క్యాంటీన్ల ద్వారా 9.71 కోట్ల భోజనాలు, 2లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శ కాలు, ఆటో డ్రైవర్లకు టాక్సీ డ్రైవర్లకు రూ.436 కోట్లు రూపాయలు పంపిణీ చేయడం జరిగిందని మెగా డీఎస్సీ ద్వారా 15941 టీచర్ పోస్టులు భర్తీ, 5757 కానీ స్టేబుల్ పోస్టులు నియామకం పూర్తి, 67.27 లక్షల మంది విద్యార్థులకు 10090 కోట్లు రూపాయలు రూపాయలు,46 లక్షల మంది అన్నదాతలకు 8985 కోట్ల రూపాయలు, 1,25 లక్షల మంది మత్స్య కార కుటుంబాలకు రూ 250 కోట్లు, ఐదు లక్షల ఇళ్ల పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీ బి కే పార్థసారథి తెలిపారు.

# మా కార్యకర్తలపై దాడి చేసిన వారిపై చర్యలు తప్పవు ఎమ్మెల్యే సురేంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూన్ 12 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవాల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడి ఘటనను ప్రభుత్వం, పోలీసులు సీరియస్‌గా తీసుకోవాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు కోరారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, అనంతపురంలో నిర్వహించిన ఎస్ఐ ఆర్ అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు బస్సులో వెళ్తుండగా అనంతపురం రూరల్ మండల పరిధిలోని కురుకుంట గ్రామం వద్ద తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనుచరులు కొందరు వ్యక్తులు బస్సుపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనలో బస్సు అద్దాలు ధ్వంసమ య్యాయని తెలిపారు. ఘటనకు సంబంధించి పార్టీ నాయకులతో కలిసి జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప రమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు చెప్పారు.

రాజకీయ విభేదాలు ప్రజా స్వామ్య పద్ధతుల్లోనే వ్యక్తం చేయాలని, హింసాత్మక చర్య లు ఎవరికీ మేలు చేయ వని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ కార్య కర్తల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని, దాడులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కురుగుంట వద్ద టీడీపీ నేతల బస్సుపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

## తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తలారి రంగయ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించిన తెలుగు తమ్ముళ్లు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూన్ 12 ప్రభాతవార్త:

అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు వస్తున్న టీడీపీ నాయ కులు ప్రయాణిస్తున్న బస్సుపై కురుగుంట సమీపంలో జరిగిన దాడి ఘటన ను తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు డిమాండ్ చేశారు. అనంత పురంలోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్‌లో ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమానికి బ్రహ్మసము ద్రం మం డలం నుంచి వస్తున్న టీడీపీ కార్యకర్తల బస్సును రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనుచం‌లు అడ్డగించి దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బస్సు అద్దాలను ధ్వంసం చేసి ప్రయాణికులను భయ భ్రాం తులకు గురిచేశారని పేర్కొన్నారు. అలాగే కళ్యాణదుర్గం పట్టణంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవాల సందర్భంగా నిర్వహిం చిన ర్యాలీని వైఎస్సార్సీపీ సమన్వయ కర్త డాక్టర్ తలారి రంగయ్య అనుచరులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని విమర్శించారు. దాడు లు, అడ్డంకులకు పాల్పడిన వారిని వెంట నే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్య కర్తలు విజయోత్సవ కార్యక్ర మాలను శాంతి యుతంగా నిర్వహిస్తుంటే ప్రతిపక్ష నాయకుల అనుచరులు దాడులకు దిగడం ఆందోళనకర మన్నారు. ప్రజా స్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజ మైనప్పటికీ హింసాత్మక చర్యలకు తావులేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాంతి, సామ రస్యాలకు ప్రాధాన్యం ఇచ్చే నాయకు డని, అందువల్లే తమ కార్యకర్తలు ఎలాంటి ప్రతిదాడులకు పాల్పడకుండా సంయ మనం పాటించా రని సురేంద్రబాబు తెలిపారు. దాడికి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పి. జగదీష్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఆంధ్ర హరితం రాష్ట్ర టూరిజం కై....సైకిల్ యాత్ర.

## నెల్లూరు నుంచి కర్ణాటక తమిళనాడు మీదుగా కన్యాకుమారికి పయనం. చిన్న వయసులో పెద్ద బాధ్యతగా.... టూరిజం తోపాటు పర్యావరణ కోసం కృషి. నెల్లూరు వాసి గుర్రం చైతన్యకు గోరంట్ల ఆర్యవైశ్యుల ఘన స్వాగతం.



సైకిల్ యాత్రలో చైతన్య.

గోరంట్ల జూన్ 12 ప్రభాత వార్త

సొంత ఇల్లు, సొంత ఊరు, సొంత జిల్లా, సొంత రాష్ట్రం సొంత దేశానికి ఎంతో కొంత మన వంతు సాయం అందించగలిగితేనే దేశానికి నిజమైన సేవ చేసిన వ్యక్తులుగా నిలుస్తారని అలాంటి వ్యక్తులు అందరికీ ఆదర్శంగా నిలుస్తారని దేశ అభ్యుదయ వాసులు అభిప్రాయపడు తుంటారు. ఇలాంటి కోవకు చెందిన వ్యక్తే నెల్లూరు జిల్లా వాసి గుర్రం చైతన్య.దేశ శ్రేయస్సు కోసం పర్యావరణ రక్షణ కోసం సొంత రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కోసం చైతన్య చేస్తున్న కృషి ఎందరికో ఆదర్శం.

వయసు చిన్నదైనప్పటికీ ఆదర్శం గొప్ప దై తను చేస్తున్న సంకల్పానికి అడ్డు రాదేది అనే దీక్షతో ముందుకు తాగు తున్నాడు గుర్రం చైతన్య. ప్రపంచ రికార్డు కోసం ఆల్ ఇండియా సైకిల్ యాత్ర కోసం ఇదివరకే 27,500 కిలోమీటర్ల యాత్ర సైతం చేయడంతో పాటు నెల్లూరు నుంచి గుజరాత్ రాష్ట్రంలోని పాకిస్తాన్ సరిహద్దు వరకు ఒకసారి, నెల్లూరు నుంచి కన్యాకుమారి వరకు మరోసారి నెల్లూరు నుంచి ఇచ్చా పురం వరకు సైకిల్ యాత్ర చేసిన ఘనత చైతన్యకే దక్కుతుంది. ఇందులో భాగంగా ఈయడాది జూన్ 7వ తేదీన నెల్లూరు నుంచి కన్యాకు మారికి 1500 కిలోమీటర్ల ప్రయాణంలో భాగంగా 25 రోజుల యాత్రకు శ్రీకరం చుట్టి శుక్రవారం సాయంత్రం చైతన్య గోరంట్లకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో గోరంట్ల పట్టణ ఆర్య వైశ్య సంఘం నాయకులు పట్టణం లోని కన్యకాపరమేశ్వర ఆలయం వద్ద చైతన్యకు ఘన స్వాగతం పలికి రాత్రి బసను ఏర్పాటు చేశారు.ఈ సందర్భ ంగా సైకిల్ యాత్రికుడు చైతన్య మా ట్లాడుతూ దేశ శ్రేయసు ్సలో భాగ ంగా పర్యావరణ పరిరక్షణ కోసం యాత్రలో దారి వెంబడి మొ క్కలు నాటుతూ సొంత రాష్ట్రంలోని పర్యా టక రంగాన్ని ప్రచారం చేస్తూ పలు రాష్ట్రాలలో యాత్ర కొనసాగి స్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు నందగోపాల్, కట్టా తిరుపాల్, జనార్దన్ గుప్తా, సుధా కర్, సుకుమార్, దండా మణికంఠ, అన్నం మణి కంఠ, ముర ళి, రాజా తదితరులు చేతుల మీదుగా ఆలయంలో చైతన్య పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# బెల్టు షాపుల మద్యం విక్రయాలపై అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు

## - అదనపు ధరల వసూళ్ల ఆరోపణలతో రాజకీయ వేడి
## - ప్రజా సమస్యా? రాజకీయ వ్యూహమా? అనే చర్చ



కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు



వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం, జూన్ 12 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రాజకీయాలు మాత్రం ఇప్పటి నుంచే ఎన్నికల వేడిని తలపిస్తు న్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అమిలినేని సురేం ద్రబాబు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డా. తలారి రంగయ్యల మధ్య సాగుతున్న రాజకీయ పోరు రోజురోజుకు మరింత ముదురుతోంది. అభివృ ద్ధి, సంక్షేమం, పాలన అంశాల నుంచి ఇప్పుడు మద్యం విక్రయాల వ్యవహా రం వరకు రాజకీయ విమర్శలు విస్తరించాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అధికార పార్టీ విజయోత్సవాలు నిర్వహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తుండగా, మరోవైపు వైసీపీ "వెన్నుపోటుకు రెండేళ్లు" అనే నినాదంతో నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో కళ్యాణదుర్గం నియోజక వర్గంలో బెల్టు షాపు ల ద్వారా మద్యం సీసాలపై రూ.30 నుంచి రూ.60 వరకు అదనపు ధరలు వసూలు చేస్తున్నారనే అంశాన్ని వైసీపీ ప్రధాన రాజకీయ అజెండాగా మార్చేం దుకు ప్రయత్నిస్తోంది .రాజకీయ అస్త్రంగా మద్యం అంశం వైసీపీ సమన్వ యకర్త డా. తలారి రంగయ్య బెల్టుషాపుల ద్వారా జరుగుతున్న అధిక ధరల వసూళ్లను ప్రజా సమస్యగా చిత్రీకరిస్తూ, దీనిపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. గతంలో ఆర్టీసీ సంస్థకు సంబంధించిన అంశాలను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లి పరిష్కారం సాధించామని గుర్తుచేస్తూ, ఇదే తరహాలో మద్యం ధరల దోపిడీపై కూడా పోరాటం చేస్తామని హెచ్చరిం చారు. పే దలు, మధ్యతరగతి వర్గాలకు చెందిన మద్యం వినియోగదారులపై అదనపు భారం పడుతోందని, ప్రభుత్వమే నిర్ణ యించిన ధరలకు మించి వసూళ్లు జరగడం ప్రజల ఆర్థిక పరిస్థితిని దెబ్బ తీస్తోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ అంశాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తీసుకెళ్లేందుకు వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అధికార పార్టీ ఎదురుదాడి అయితే ఈ ఆరోప ణలను అధికార పార్టీ వర్గాలు పూర్తిగా ఖండిస్తున్నాయి. బెల్టు షాపుల నిర్వహణ, మద్యం విక్రయాల్లో ఎమ్మెల్యే సురేంద్రబాబుకు ఎలాంటి సంబం ధం లేదని స్పష్టం చేస్తున్నాయి. మద్యం దుకా ణాల నిర్వహణ బాధ్యత లు సంబంధిత ఏజె"న్సీల పరిధిలోనే ఉంటాయని, రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ నిరా ధార ఆరోపణలు చేస్తోందని టిడిపి నేతలు విమర్శిస్తు న్నారు. కళ్యాణి వైన్స్ నిర్వహణ వ్యవహారాన్ని ఏజెన్సీ చూస్తోందని, విక్రయాల నిర్వహ ణలో రాజకీయ జోక్యం లేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్షం కొత్త వివాదాలకు తెరలేపు తోందని అధికార పార్టీ ఆరోపిస్తోంది. బెల్టు షాపులపై పాత వివాదం మళ్లీ తెరపైకి రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపుల అంశం ఎన్నో సంవత్స రాలుగా రాజకీయ చర్చకు కేంద్రబిందు వుగా ఉంది. ఎన్ని కల సమయంలో అక్రమ మద్యం విక్రయాలను అరికడతామని అన్ని పార్టీలు హామీలు ఇచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల వ్యవహా రం పూర్తిగా అదుపులోకి రాలేదన్న విమర్శలు కొనసాగుతూనే ఉన్నా యి. ముఖ్యమంత్రి బెల్టు షాపుల నిర్వహణపై కఠిన హెచ్చరికలు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు అంత ప్రభావవంతంగా కనిపించడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తు న్నాయి. ఎక్సైజ్ శాఖ కూడా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ఎన్నికల దిశగా రాజకీయ వ్యూహాలు రాజకీయ విశ్లేషకుల అభి ప్రాయం ప్రకారం, కళ్యాణదుర్గంలో మద్యం విక్రయాల అంశం కేవలం ధరల వివాదం మాత్రమే కాకుండా, రాబోయే ఎన్నికల రాజకీయాలకు పునాది వేస్తున్న అంశంగా మారుతోంది. ప్రజలకు నేరుగా సంబంధం ఉన్న సమస్యలను ప్రస్తావిం చడం ద్వారా అధికార పార్టీని ఇరకాటంలో పెట్టాలని వైసీపీ చూస్తుండగా, అభివృద్ధి పనులు మరియు సంక్షేమ పథకాల అమలు తో ప్రజల మద్దతు నిలబెట్టుకో వాలని టిడిపి ప్రయత్నిస్తోంది. మొత్తంగా చూస్తే, కళ్యాణదుర్గం రాజకీ యాల్లో "మద్యం పై యుద్ధం" కొత్త మలు పు తిరిగింది. ఇది ప్రజా సమస్య పరిష్కా రానికి దారితీస్తుందా? లేక అధికారప్ర తిపక్షాల మధ్య రాజకీయ పోరాటానికి మాత్రమే పరిమితమవుతుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# పారదర్శక ఓటర్ల జాబితానే లక్ష్యంగా పనిచేయాలి

## క్లస్టర్, కోక్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, బీఎల్ఏలకు ఎమ్మెల్యే సురేంద్రబాబు దిశానిర్దేశం



ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మె ల్యే అమిలినేని సురేంద్రబాబు



సదస్సుకు హాజరైన బ్రహ్మసముద్రం మండల టీడీపీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు

కళ్యాణదుర్గం, జూన్ 12, ప్రభాతవార్త

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల జాబితా పునాది అని, ప్రతి బూత్‌లో ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులేమీ లేకుండా ఉండేలా పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు కృషి చేయాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. అనంతపురం పట్టణంలోని ఎస్ఎస్ఆర్ గ్రాండ్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్ర మంలో బ్రహ్మసముద్రం మండలానికి చెందిన క్లస్టర్, కోక్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు, బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) ఎస్ఐఆంý (Special Intensive Revision) విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ, ప్రస్తుతం ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవా లని సూచించారు. గ్రామాల్లో బీఎల్వో అధికారులతో సమన్వయం చేసుకొని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని చెప్పారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు కలిగిన వారి పేర్లను గుర్తించి తొలగించే చర్యలు తీసుకో వాలని సూచించారు. అదేవిధంగా, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతను ఓటర్ల జాబితాలో చేర్చేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు కేవలం ఎన్నికల అవసరమే కాకుండా ప్రజాస్వామ్య బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌లో కీలక సూచనలు:ప్రతి బూత్‌లో ఇంటింటి ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలి. బీఎల్వోలకు అవసరమైన సమాచారం సకాలంలో అందిం చాలి. డూప్లికేట్, నకిలీ ఓట్ల గుర్తింపులో జాగ్రత్తలు పాటించాలి. కొత్తగా అర్హత పొందిన యువత, మహి ళల నమోదు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఓటర్ల జాబితాపై అభ్యంత రాలు, సవరణలు నిర్ణీత గడువులోగా సమ ర్పించాలి. ప్రతి బూత్‌లో డేటా సేకరణకు బాధ్యతా యుతమైన బృందాలను ఏర్పాటు చేయాలి.ఓటర్ల జాబితా నాణ్యతే ఎన్నికల విశ్వసనీ యతకు ఆధారం:ప్రజాస్వామ్యంలో ఎన్నికల విశ్వసనీయత ఓటర్ల జాబితా నాణ్యతపై ఆధార పడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అర్హులైన ఓటర్లకు అవకాశం కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా మారు తుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం రాజకీయ పార్టీలకు, ఎన్నికల యంత్రాంగానికి కీలక బాధ్యతగా మారిందని నిపుణులు చెబుతున్నారు. కార్యక్రమంలో మండల స్థాయి టీడీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, క్లస్టర్ మరియు బూత్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు

# నూతన విద్యా సంవత్సరంకు విద్యార్థులకు స్వాగతం



తల్లిదండ్రులకు, విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



కొత్త విద్యా సంవత్సరంకు విద్యా ర్థులకు యాజమాన్యం స్వాగతం

డి.హిరేహాళ్ జూన్ 12 ప్రభాతవార్త

విద్యార్థులు, తల్లిదండ్రులకు బాల మేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వన్నూరు స్వామి, మేనేజింగ్ పాటర్ నాగరాజు, ఉపాధ్యాయ బృందంతో కలిసి పాత విద్యా సంవత్సరంకు వీడ్కోలు పలుకు తూ కొత్త విద్యా సంవత్సరంకు వెల్కమ్ పలికారు. శుక్రవారం డి.హిరేహాళ్ మండలం కళ్యం గ్రామంలోని బాల మేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమన్వయంతో కొత్త విద్యా సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికి విద్య, సంస్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించి అంగరంగ వైభవంగా కొత్త విద్యా సంవత్సరం ఆహ్వాన వేడుకలు నిర్వహించారు. బాల మేధావి ఇంగ్లీష్ పడే ఉన్నత పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తల్లిదండ్రుల మధ్య కొత్త విద్యా సంవత్స రానికి స్వాగతం పలికి మంగళ వాయి ద్యాల మధ్య సాంప్రదాయబద్ధంగా కొత్త విద్య సంవత్సరం కు పాఠశాలలో ఘనంగా స్వాగత వేడు కలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యాంతం విద్యార్థులు, తల్లిదండ్రుల , ఉపాధ్యాయులు మధ్య కోలాహ లంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల, విద్యార్థు లచే రిబ్బన్ కట్ చేయించి కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలకడం జరిగిందని పర్స్పాండెంట్ తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మంగళ హారతు లు ఇచ్చి అక్షింతలతో వారి జీవితం ఉజ్వలంగ, దేదీప్యమానంగ వెలుగొందాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదిం చడం జరిగిందని పర్స్పాండెంట్ చెప్పారు. మొదటి రోజు కార్యక్రమాన్ని ఎం తో సంతోషంగ, సాంప్రదా యబద్ధంగ, ఆనందంగ విద్యార్థులు వారి తల్లిద ండ్రుల మధ్య జరుపుకోవడం అత్యంత ఆనందదాయకంగా ఉందని కరస్పా ండెంట్ చెప్పారు. ఈ కార్యక్రమం పై విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారని ఈ కరెస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం తెలిపారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ - పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ

శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 12, ప్రభాతవార్త ప్రతినిధి

విధులకు ఆలస్యంగా వచ్చే వారిపై, ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహించే అధికారులపై శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. శుక్రవారం పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు శాతాన్ని, ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కార ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. పుట్టపర్తి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో పట్టణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీల పూడికతీత పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్, ఇతర ప్రజా ఫిర్యాదుల విభాగాల ద్వారా వచ్చే ప్రతి అర్జీని గడువు లోపల నాణ్యతతో పరిష్కరించాలని, దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న సిమెంట్ రహదారులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.